ప్రజాశక్తి
మంగళవారం 14 నవంబర్ 2023
5
విజయనగరం

ఖోఖో బాల, బాలికల జట్లు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాజీవ్ క్రీడా మైదానంలో సబ్ జూనియర్స్ ఖోఖో బాల బాలికల జిల్లా జట్లు ఎంపిక సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి 250 మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఖోఖో అసోసియేషన్ చైర్మన్ చిన్నం నాయుడు, జిల్లా కార్యదర్శి చింత సత్యనారాయణ, ట్రెజరర్ బి.మల్లికార్జునరావు, ఆర్గనైజింగ్ సెక్రటరి కె.గోపాల్, బి.శ్రీను, టి.సత్యనారాయణతో పాటు సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు కె.బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. ఎంపికైన జట్లు ఈనెల 26 27 28 తేదీల్లో నరసరావుపేటలో జరిగే రాష్ట్ర ఖో ఖో పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు.

ప్రజారక్షణ భేరికి

కదలనున్న ఎర్రదండు

- రేపు విజయవాడలో సిపిఎం బహిరంగ సభ
- పయనమవుతున్న కార్మికులు, కర్షకులు, చిరుద్యోగులు
- విజయనగరం నుంచి రెండు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి నేడు ఎర్ర దండు కదలనుంది. సిపిఎం ఆధ్వర్యాన ఈనెల 15న విజయవాడలో జరగనున్న భారీ బహిరంగ సభకు పయనమవుతున్నారు. మంగళవారం సాయంత్రం బస్సులు, రైళ్లలో బయలు దేరనున్నారు. ఎక్కువగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలు, స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, చిరువ్యాపారులు, ప్రత్యేకించి మహిళలు కదిలేందుకు సిద్ధమౌతున్నారు. సిపిఎం కార్యకర్తలు, నాయకులు కూడా అధిక సంఖ్యలో కదలనున్నారు. ఇందుకు అనుగుణంగా ఇప్పటికే ప్రయాణ ఏర్పాట్లు పూర్తయాయి. కొన్ని రైళ్లు రద్దు కావడంతో ప్రత్యామ్నాయంగా ప్రత్యేక బస్సులు కూడా ఏర్పాటు చేసుకున్నారు. వాలంటీర్లుగా వ్యవహరించేందుకు ఇప్పటికే కొంతమంది విజయవాడకు చేరుకున్నారు.

అసమానతలు లేని అభివృద్ధి పేరిట సిపిఎం ప్రజారక్షణ భేరి బస్సుయాత్ర రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోను చేపట్టింది. గతనెల 30 నుంచి మూడు జాతాలు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ప్రారంభమయ్యాయి. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలో ప్రారంభమైన ప్రజా రక్షణ భేరి యాత్ర పాలకొండ, కురుపాం, పార్వతీపురం, సీతానగరం, మక్కువ, సాలూరు, మెంటాడ, గజపతినగరం, బుడతనాపల్లి, బొడ్డవర జంక్షన్ల మీదుగా మూడు రోజులపాటు సాగింది. అటు శ్రీకాకుళం నుంచి ప్రారంభమైన మరో యాత్ర పూసపాటిరేగ, విజయనగరం, భీమిసింగి, జామి మీదుగా ఎస్.కోట, కొత్తవలస వరకు సాగింది. ఈ సందర్భంగా యాత్రలో పాల్గొన్న సిపిఎం నాయకులకు వివిధ వృత్తులు, సామాజికవర్గాలు, రైతులు, వ్యవసాయ కార్మికులు, చిరుద్యోగులు, స్కీమ్‌వర్కర్లు, కార్మికులు, గిరిజనులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. తమ సమస్యలను ఏకరువు పెడుతూ పరిష్కారానికి పాలకులపై పోరాడాలంటూ విన్నవించారు. ఇందుకు సిపిఎం నాయకులు కూడా హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో యాత్రల ముగింపు సందర్భంగా విజయవాడలో సిపిఎం ఆధ్వర్యాన జరుగనున్న భారీ బహిరంగ సభకు తరలిరావాలంటూ నాయకులు పిలుపు నిచ్చారు. ఈ నేపథ్యంలో సభను జయప్రదం చేయసేందుకు జిల్లాల్లో సిపిఎం నాయకులు ఆటో, బైకు ప్రచారాలు చేపట్టారు. పలుచోట్ల ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఫలితంగా జనంలో సిపిఎం చూపుతున్న ప్రత్యామ్నాయ విధానాలపై చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో సిపిఎం శ్రేణులతోపాటు అభిమానులు, వివిధ తరగతులకు చెందిన ప్రజానీకం విజయవాడకు పయనమౌతున్నారు. పలు రైళ్లు రద్దు కావడంతో విజయనగరం, గరివిడి ప్రాంతాల నుంచి రెండు ప్రత్యేక బస్సులు బయలదేరనున్నాయి. వీటిని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్య నారాయణ మంగళవారం సాయంత్రం జెండా ఊపి ప్రారంభించ నున్నారు. మిగిలినవారు అందుబాటులో ఉన్న రైళ్లు, ఆర్‌టిసి బస్సులు, ప్రైవేటు వాహనాల్లో కదిలేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్టు సమాచారం. అటు పార్వతీపురం జిల్లా నుంచి కూడా అధిక సంఖ్యలో కదల నున్నారు. పార్వతీపురం, కురుపాం, గుమ్మలక్ష్మీపురం తదితర ప్రాంతాల నుంచి ఎక్కువ మంది కదిలేందుకు సన్నద్ధమయ్యారు. అటు గిరిజన ప్రాంతం, ఇటు మైదాన ప్రాంతం నుంచి కూడా పయనమౌతున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు స్పష్టం చేశారు. సభకు సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు హాజరు కానున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందు ప్రత్యామ్నాయ విధానాలు ఉంచడంతో పాటు ఆయా ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేసి, పాలకులకు హెచ్చరిక చేస్తారని నాయకులు చెబుతున్నారు. ప్రజలకు జరుగుతున్న కష్టనష్టాలపై మరో పోరుకై పార్టీ కేడర్‌కు దశ, దిశ నిర్ధేశం చేయనున్నారు. ఇక జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయాలని సిపిఎం డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా తోటపల్లి, జంఝావతి, తారకరామ తీర్థసాగర్ పూర్తికి నిధులు కేటాయించాలని ఇటీవల జిల్లాలో సాగిన ప్రజారక్షణ భేరీ యాత్రలో బృందం నాయకులు డిమాండ్ చేశారు. అటవీ హక్కుల చట్టం, పీసా, 1/70 చట్టం పరిరక్షణకు పోరాడుతామని గిరిజనులకు హామీ ఇచ్చింది. జ్యూట్, ఫెర్రో ఎల్లాయిస్, చక్కెర తెరిపించాలని డిమాండ్ చేసింది. ముఖ్యంగా ఉపాధి హామీ చట్టంలో భాగంగా ఏడాదికి 200రోజులు పని కల్పించడంతోపాటు రోజుకు రూ.600 వేతనం అందజేయాలని కోరింది. ఇలా ప్రాంతం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో గుర్తించిన అనేక సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా పోరాటాలు నడుపుతామని సిపిఎం నాయకులు చెబుతున్నారు. ఈనేపథ్యంలో బహిరంగ సభకు మంచి స్పందన లభిస్తోంది.

శృంగవరపుకోటలో జెండా ఊపి ప్రచారాన్ని ప్రారంభిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు రామ్మోహన్,వెంకటేష్, రాము, సౌమ్య తదితరులు

విద్యా రంగ సమస్యల పరిష్కారానికి

17 నుంచి నిరవధిక దీక్షలు

- 21న చలో కలెక్టరేట్
- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17 తేదీ నుంచి కలెక్టరేట్ వద్ద నిరవధిక నిరాహార దీక్షలు చేపడతామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ వెంకటేష్, పి.రామ్మోహన్ తెలిపారు. సోమవారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జూలై 31 నుంచి ఆగస్టు 10 తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా సైకిల్ యాత్ర చేసి విద్యారంగ సమస్యలు తెలుసుకున్నామని చెప్పారు. సైకిల్ యాత్ర లో గుర్తించిన సమస్యలు పరిష్కరించాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు, జిల్లా అధికార యంత్రాంగానికి వివిధ ఆందోళనల రూపంలో తెలియచేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల్లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరినా నేటి వరకు పట్టించుకోలేదన్నారు. విజయ నగరం, రాజాం డిగ్రీ కళాశాలలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, బొబ్బిలి, కొత్తవలస డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేయాలని, సంక్షేమ వసతి గృహాల్లో తాగునీరు,మరుగుదొడ్లు, ప్రహరీ వంటి మౌలిక వసతులు కల్పించాలని, శిథిలావస్థకు చేరిన భవనాలకు మరమ్మతులు చేపట్టడం, కొత్త భవనాలు నిర్మించడం చేయాలని, సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. మరోవైపు నూతన విద్యా విధానం పేరిట పాఠశాలలను కుదించడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుతున్నారని తెలిపారు. నాడు-నేడు కింద చేపడుతున్న పాఠశాల భవనాలు పూర్తికాక పోవడంతో చాలా చోట్ల విద్యార్థులు ఇరుకు గదుల్లోనే కూర్చోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఖాళీ టీచర్‌పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరవధిక దీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అప్పటికి అధికారులు, ప్రభుత్వం స్పందించి పరిష్కరించక పోతే 21 తేదిన వేలాది మంది విద్యార్థులతో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని తెలిపారు. అనంతరం నిరవధిక దీక్ష పోస్టర్‌ను విడుదల చేశాఉ. సమావేశంలో జిల్లా నాయకులు డి.రాము, సౌమ్య, రమేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు శంకర్ నాయుడుపై విచారణ

ఎంఇఒకు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పూసపాటిరేగ మండలం చోడమ్మ అగ్రహారం ఎంపియుపి పాఠశాలలో విద్యార్థినుల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడు శంకర్ నాయుడుపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ఎంఇఒ రాజ్‌కుమార్‌ను ఆదేశించారు. సమగ్ర విచారణ చేసి, తప్పు జరిగినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.

పోక్సో చట్టం కింద చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ఉపాధ్యాయుడు శంకర్ నాయుడుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ వెంకటేష్, పి.రామ్మోహన్ డిమాండ్ చేశారు. విద్యా బుద్దులు చెప్పాల్సిన గురువులే విద్యార్థులను లైంగికంగా వేదించడం , దానిని అధికారులు కప్పి పుచ్చే విధంగా వ్యవహరించడం సిగ్గు చేటని తెలిపారు. తక్షణమే ఇలాంటి పనులు చేస్తున్న శంకర నాయుడుని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లైంగిక వేదింపులు జరుగుతున్నా యని ఎంఇఒ దృష్టికి తీసుకెళ్తే కనీసం విచారణ కూడా జరపకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. అవినీతికి పాల్పడిన ఎంఇఒను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఒత్తిళ్లకు, అవినీతికి తలొగ్గి చర్యలు తీసుకోకపోతే విద్యార్థుల తిరుగు బాటుకు జిల్లా విద్యా శాఖ అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు .

కఠిన చర్యలు తీసుకోవాలి : ఎస్ టి యు

లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యా యుడు శంకర్‌నాయుడుపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు వై.అప్పారావు, ప్రధాన కార్యదర్శి డి.శ్యామ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

20తులాల బంగారు నగలు చోరీ

ప్రజాశక్తి-చీపురుపల్లి

పట్టణంలోని ఆంజనేయపురం విజయకృష్ణ రెసిడెన్సీలో నివాసముంటున్న తమ్మినాన గంగధార ఇంట్లో ఆదివారం రాత్రి దొంగలు చొరబడి 20తులాల బంగారు ఆభరణాలు, కెజిన్నర వెండి దోచుకుపోయారు. దీపావళి సందర్భగా గంగాధర్ కుటుంబ సభ్యులు శ్రీకాకుళం వెళ్లిపోగా, ఇంటి వెనుక కిటికీ గ్రిల్స్‌ను తొలగించి చోరీకి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదుతో డిఎస్‌పి చక్రవర్తి, సిఐ ఉపేంద్ర,ఎస్ఐ సన్యాసినాయుడు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

పోరాట విజయం

అయ్యప్పనగర్ వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు, అయ్యప్ప నగర్ వాసులు చేపట్టిన పోరాటం విజయం సాధించింది. నగరంలోని అయ్యప్పనగర్ రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు వేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని కొద్ది రోజులుగా పోరాటం సాగించారు. నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద, కలెక్టరేట్ వద్ద ఆందోళనలు చేపట్టి, స్పందనలో కలెక్టర్‌కు వినతులు ఇచ్చారు. అయ్యప్పనగర్ వద్ద విజయనగరం- పాలకొండ రహదారిపై స్పీడ్ బ్రేకర్‌లు లేక పోవడం వలన ఇటీవల కాలంలో ముగ్గురు ప్రమాదానికి గురై మరణించడం, దసరా ముందు రోజు ఆటోను బొలెరో వాహనం ఢీకొని ఆరుగురు గాయపడడం జరిగింది. అధికారులు స్పందించకపోవడంతో పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో స్పందించిన అధికారులు దీపావళి రోజు రాత్రి స్పీడ్ బ్రేకర్‌లు ఏర్పాటు చేశారు.

ఉద్యోగ భద్రతకై సమ్మెకు సిద్ధం

రౌండ్ టేబుల్ సమావేశంలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్‌లో సమ్మె కు సిద్ధం కావాలని సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి పిలుపునిచ్చింది. సోమవారం జెఎసి జిల్లా కార్యదర్శి బి.కాంతారావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం స్థానిక ఎన్ పి అర్ భవనంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ పరిధిలో పనిచేస్తున్న సమగ్ర శిక్షా ప్రాజెక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం ఉ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. పిఆర్‌సి అమలు చేయకపోవడం, నెలలు తరబడి వేతనాలు విడుదల చేయకపోవడం దుర్మార్గమని అన్నారు. కనీస వేతనాలు అమలుకు జీవోలు మీదు జీవోలు ఇచ్చినా అమలు చేయడం లేదన్నారు. ఉద్యోగుల మధ్య విబేధాలు, విభజన సృష్టించే విధానాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రాజెక్టులో ఒకే క్యాడర్ ఉద్యోగులకు రకరకాల వేతనాలు చెల్లిస్తూ, కొత్త విధానాలకు తెరలేపారని, పాత వారికి జీతం పెంచకుండా, కొత్తగా నియమితమైన వారికి జీతం పెంచే సాంప్రదాయాన్ని ప్రారంభించారని తెలిపారు. ఎన్నికలకు ముందు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తామని, అన్ని విధాలుగా కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగుల కుటుంబాలను ఆదుకుంటామని చెప్పి, ఒక్క సమస్యకు కూడా శాశ్వత పరిష్కారం చూపలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలు అమలు చేశామంటూ గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం, అందరిని రెగ్యులర్, సమాన పనికి సమాన వేతనం ఎందుకు అమలు చేయలేకపోయారో చెప్పాలని ప్రశ్నించారు?. జీతాలు పెంచుతున్నట్లు పుకార్లు సృష్టించడం, ఇతర సంఘాలతో ప్రకటన చేయించడం తప్ప, వాస్తవంగా జీతాలు పెంచాలని చిత్తశుద్ధి లేదన్నారు. ఈనేపథ్యంలో త్వరలో అన్ని జిల్లా, రాష్ట్ర కమిటీలు, అన్ని సంఘాలు, ఉద్యోగులతో కలసి సమ్మె నోటీసు ఇచ్చి, డిసెంబర్‌లో సమ్మెకు వెళ్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రవేశపెట్టిన తీర్మానాలను సమావేశం ఆమోదించింది. నవంబర్ 20న సమ్మె నోటీసు ఇవ్వాలని, 21 నుంచి గడప గడపకు మా బాధలు చెపుదాం పేరిట కార్యక్రమం చేపట్టాలని, డిసెంబర్ మొదటి లేదా రెండో వారంలో చలో విజయవాడ కార్యక్రమం చేపట్టాలని తీర్మానం చేశారు. సమావేశంలో కెజిబివి నాన్ టీచింగ్ స్టాఫ్ నాయకులు రామకృష్ణ, సునీత, ఆర్ట్ క్రాఫ్ట్ టీచర్స్ యూనియన్ నాయకులు రవీంద్రబాబు, కృష్ణం నాయుడు, ఎఎన్ఎం అరుణ, జయగణేష్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెఎసి జిల్లా కార్యదర్శి కాంతారావు

వైసిపిని గద్దె దించడమే లక్ష్యం

జనసేన జెఎసి సభ్యులు యశస్వి, అరుణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో వైసిపిని గద్దె దించడమే లక్ష్యమని, జనసేన-తెలుగుదేశం పార్టీ సమన్వయంతోనే అది సాధ్యమని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జనసేన-తెదేపా జెఎసి రాష్ట్ర సభ్యులు పాలవలస యశస్వి, పిఎసి సభ్యురాలు పడాల అరుణ, జనసేన-తెదేపా విజయనగరం జిల్లా కో ఆర్డినేటర్ లోకం మాధవి అన్నారు. సోమవారం ఆ పార్టీ కార్యాల యంలో జనసేన నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు భవిష్యత్ కార్యాచరణపై దిశా నిర్దేశం చేసారు. క్షేత్ర స్థాయిలో జనసేన, టిడిపి నాయకులు కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. త్వరలోనే ఉమ్మడి మానిఫెస్టో రానుందని, దానిని ప్రతి ఇంటికీ చేర్చాల్సిన బాధ్యత కార్యకర్తలంద రిపైనా ఉందని అన్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో పాలవలస యశస్వి మాట్లాడుతూ ప్రతి కార్యకర్త పార్టీ నిర్ణయాలకు కట్టుబడి పనిచేయాలని, పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా ఉమ్మడి కార్యాచరణను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పడాల అరుణ మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో టిడిపి-జనసేన ప్రభుత్వమే ఏర్పడనుందన్నారు. జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలేవీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. నవరత్నాలపేరిట నయ వంచన చేశారన్నారు. ఓ వైపు సంక్షేమ పథకాలు అని చెప్పి మరోవైపు అనేక రకాల పన్నుల వేసి దోచుకుంటున్నాడని అన్నారు. సమావేశంలో పార్టీ ప్రచార కార్యదర్శి బాబు పాలూరి, బొబ్బిలి జనసేన ఇన్‌ఛార్జి గిరిడ అప్పలస్వామి, జనసేన ఉత్తరాంధ్ర కో ఆర్డినేటర్ తుమ్మి లక్ష్మిరాజ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నాయకులు యశస్వి, పడాల అరుణ

కాలుష్య కోరలు నుంచి కాపాడండి

- 18న నిరాహారదీక్ష
- సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస మండలాన్ని కాలుష్య కోరలు నుంచి రక్షించడానికి అందరూ ముందుకు రావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. మండలంలో సోమవారం ప్రజలను కలిసి కరపత్రాలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధి చెందినప్పటికీ కాలుష్యాన్ని వెదజల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు, పాలకులు ఎన్ని మారినా ఈ ప్రాంత వాసుల తలరాత మారలేదని ఆందోళన వ్యక్తం చేశారు. హెవీ వాహనాలు తిరగడం, పరిమితికి మించి వాహనాలు ఈ రోడ్డు గుండా వెళ్లడం వల్ల రోడ్లు పూర్తిగా పాడయ్యాయని అన్నారు. ప్రభుత్వాలకు ఆదాయం వచ్చినప్పటికీ మరమ్మతులకు నోచుకోకపోవడం విచారకరమని అన్నారు. కంటకాపల్లి రైల్వే స్టేషన్ నుంచి రవాణా చేస్తున్న బొగ్గు, ఐరన్ ఓర్ వాహనాలు వల్ల రోడ్డు పూర్తిగా పాడైపోయిందన్నారు. కంటకాపల్లి నుంచి విశాఖపట్నం వరకు రోడ్లు పూర్తిగా పాడయ్యాయని అన్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్లు మరమ్మత్తులు చేపట్టాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గాడి అప్పారావు, చల్లా జగన్, గొంప రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు తమ్మినేని తదితరులు

వైష్ణవ్ ఐకేర్‌లో నేడు ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా మంగళవారం నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్సు సమీపంలోని వైష్ణవ్ ఐకేర్ (వెంకటరామా ఆస్పత్రి)లో మధు మేహ రోగులకు ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్షులు గద్ద చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా ఉచితంగా ఓపి, షుగర్ పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉచితంగా నిర్వహిస్తారని తెలిపారు. ఇతర సమాచారం కోసం 9000 15 2020, 9949 14 8211 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

30న గురజాడ సాహితీ చైతన్యోత్సవం

3న చంద్రబోస్‌కు పురస్కార ప్రదానం

ప్రజాశక్తి-విజయనగరం కోట

మహాకవి గురజాడ వెంకట అప్పారావు వర్ధంతి సందర్భంగా ఈనెల 30న గురజాడ సాహితీ చైతన్యోత్సవం, విశిష్ట పురస్కార ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు గురుజాడ సాంస్కృతిక సమాఖ్య కార్యదర్శి కాపుగంటి ప్రకాష్ తెలిపారు. సోమవారం గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 30వ తేదీ ఉదయం గురజడ స్వగృహంలో ముఖ్య అతిథులు జిల్లా పరిషత్ చైర్మన్, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన ఉంటుందన్నారు అనంతరం అక్కడి నుంచి గురజాడ వాడిన వస్తువులతో విద్యార్థులు, కళాకారులుతో ఊరేగింపుగా ఎంఆర్ కళాశాల వద్దగల గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామని తెలిపారు. ఉదయం 10:30గంటలకు గురుజాడ కేంద్ర గ్రంథాలయంలో గురజడ సాహితీ సదస్సు ఉంటుందన్నారు. గురజాడ కవితలపై పెట్టిన పోటీలలో విజేతలైన సాలూరుకు చెందిన కిలపర్తి దాలినాయుడు, విజయనగరానికి చెందిన సాలూరు సంతోషి, రత్నాల బాలకృష్ణ, కర్నూల్‌కు చెందిన సయ్యద్ జహీర్ అహ్మద్, నాగార్జునసాగర్ కు చెందిన సరికొండ నరసింహరాజు, విశాఖపట్నం అల్లం శెట్టి శ్రీనివాసరావు, ఆముదాలవలసకు చెందిన కుప్పిలి వెంకట్రావు, హైదరాబాద్‌కు చెందిన దేశరాజు తదితరులు స్వీయ కవితా పఠనం చేస్తారని తెలిపారు.

ఈ ఏడాది గురజాడ పురస్కారానికి ఎంపికైన సినీ గేయ రచయిత కెఎస్ చంద్రబోస్‌కు ఈనెల 3న ఆనంద గజపతి ఆడిటోరంలో అవార్డును ప్రదానం చేస్తామని కాపుగంటి ప్రకాష్ తెలిపారు. ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి యు.దుర్గాప్రసాదరావు, శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా అవార్డు అందజేస్తామని తెలిపారు. సమావేశంలో గురజాడ సాంస్కృతిక సమైక్య అధ్యక్షులు పివి నరసింహారాజు, కోశాధికారి డాక్టర్ ఎం. గోపాలరావు, ఎస్ఎస్ఎస్ఎస్ రాజు, జక్కు రామకృష్ణ, బి.సూర్యలక్ష్మి, గురజాడ ఇందిరా, సాహితీ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఈ నెల 14న సాయంత్రం 4గంటల నుండి 5గంటల వరకు డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కె. రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌కోట డిపో పరిసర ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఏమైనా సమస్యలుంటే డిపో మేనేజర్ 9959225619, డిప్యూటీ సూపరింటెండెంట్ 9490583579 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

బాలల సంచికను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

'ప్రజాశక్తి' బాలల సంచిక ఆవిష్కరణ

గరివిడి: ఈనెల 14న బాలల దినోత్సవం సందర్భంగా 'ప్రజాశక్తి' పిల్లల్లో సృజనాత్మకత పెంపొందించడానికి 'బాలానందిక చిరు మువ్వలు' ను తీసుకొచ్చింది. ఈ ప్రత్యేక సంచికను గరివిడి యుటిఎఫ్ కార్యాలయంలో రాష్ట్ర నాయకులు డి.రాము ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. బాలల కోసం రూపొందించిన ఈ చిరుమువ్వలు పిల్లల ప్రత్యేక సంచికను గరివిడి, చీపురుపల్లి మండలాలల్లో అన్ని పాఠశాలల విద్యార్థులకు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.సత్యశ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మీసాల అప్పలనాయుడు, గొర్లె పద్మావతి, సూరి శ్రీను, మీసాల రవికుమార్, డి. సతీష్, గరివిడి, చీపురుపల్లికి చెందిన యుటిఎఫ్ నాయకులు జి.లక్ష్మణ్, బి.బంగార్రాజు, ఐక్య సత్యనారాయణ, ఎ.కనకేశ్వరరావు, ఎం. వరప్రసాద్ పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర

భోగాపురం: 2024లో కూడా మరోసారి జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని శ్రీకాకుళం జిల్లా టెక్కలికి చెందిన అఖిల భారత యువజన సంఘం అధ్యక్షులు జి.గురునాథ్ యాదవ్ టెక్కలి నుంచి తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. ఆదివారం భోగాపురం చేరుకున్న ఆయన పాదయాత్రను స్థానిక వైసిపి నాయకులు స్వాగతం పలికారు. వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, సచివాలయ కన్వీనర్ పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్ పాదయాత్ర విజయవంతం కావాలని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మళ్లీ ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం మరింత అభివృద్ధి జరుగుతుందని, పేదలకు మరెన్నో పథకాలు వస్తాయని సూర్యనారాయణ రెడ్డి అన్నారు. రోజుకు 30 నుంచి 40 కిలోమీటర్లు పాదయాత్ర చేస్తున్నట్లు గురునాథ్ యాదవ్ తెలిపారు. ఆయన మళ్ళీ ముఖ్యమంత్రి అవ్వాలని రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు.

ఇక్కడ వైద్యం బాగుంటే హైదరాబాద్ ఎందుకు?

బొబ్బిలి: రాష్ట్రంలో సిఎం జగన్ మోహన్ రెడ్డి వైద్య రంగానికి పెద్దపీట వేశారని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సకల సౌకర్యాలు కల్పించారని మంత్రులు, ప్రజా ప్రతినిధులు సమావేశాల్లో చెబుతున్నారని మరి మన విద్యా శాఖ మంత్రి బొత్స వైద్యం చేయించుకోవడానికి పక్క రాష్ట్రం ఎందుకు వెళ్లారని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర రావు ప్రశ్నించారు. ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ వైసిపి నాయకులు చెప్పిన విధంగా వైద్య రంగంలో అన్ని రకాల సదుపాయాలూ ఇక్కడే ఉన్నపుడు పక్క రాష్ట్రానికి వెళ్ళవలసిన అవసరం మంత్రికి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. మంత్రి ఒక్కరే కాకుండా రాష్ట్రంలో ఉన్న ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు కూడా వైద్యం కోసం హైదరాబాద్ వెళ్ళిపోతున్నారన్నారు. అంటే మన రాష్ట్రంలో వైద్య సదుపాయాలు లేవా? అనుభవంగల వైద్యులు లేరా? శస్త్ర చికిత్సలు చేసే నిపుణులు లేరా? అని ఎద్దేవా చేశారు. ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్న ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు ప్రభుత్వం అమలు చేస్తున్న సేవలను ముందుగా వినియోగించుకొని తర్వాత ప్రజలకు చెబితే బాగుంటుందన్నారు. వారు వినియోగించుకోకుండా ప్రజలకు ఉపన్యాసాలు చెప్పడం వల్ల ప్రయోజనం లేదన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

వంగర: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అధ్యక్షతన మంగళవారం ఉదయం 10.30 గంటలకు సర్వసభ్య సమావేశం జరగనుందని ఎంపిడిఒ హనుమంతు శశిభూషణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపిటిసిలు వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

రేపు వైసిపి సమావేశం

బొబ్బిలి: ఈ నెల 22న బొబ్బిలిలో జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్ర జయప్రదం చేసేందుకు బుధవారం ఉదయం 10గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. సమావేశానికి ముఖ్య వక్తగా జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరవుతారని, ప్రజాప్రతినిధులు, జెసిఎస్, సచివాలయ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

నేడు సవరవల్లిలో గడపగడపకు

భోగాపురం: మండలంలోని సవరవల్లి సచివాలయం పరిధిలో మంగళవారం నుంచి గడపగడపకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి సోమవారం తెలిపారు. ఇటీవలి రెండు రోజులపాటు ఈ సచివాలయం పరిధిలోని నిర్వహించినప్పటికీ కొన్ని గ్రామాలు ఉండిపోయావని అన్నారు. మధ్యాహ్నం నుంచి ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం ఇదే సచివాలయం పరిధిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, సర్పంచులు, ఎంపిటిసిలు హాజరు కావాలని ఆయన కోరారు.

బొత్స కోలుకోవాలని ప్రత్యేక పూజలు

గజపతినగరం: మంత్రి బొత్స సత్యనారాయణ కోలుకోవాలని, క్షేమంగా ఆసుపత్రి నుండి ఇంటికి రావాలని గజపతినగరం జెడ్‌పిటిసి గార తవుడు, ఎంపిపి బెల్లాన జ్ఞానదీపికలు సోమవారం స్థానిక శివాలయంలో 101 టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బూడి వెంకటరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, సర్పంచ్ బెల్లాన త్రినాధరావు, వైస్ సర్పంచ్ మండల సురేష్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సామంతుల పైడిరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జనసేన సమన్వయకర్తగా గిరడ

బొబ్బిలి: జనసేన నియోజకవర్గ సమన్వయ కర్తగా గిరడ అప్పలస్వామిని నియమిస్తూ అధిష్టానం ప్రకటించింది. ఆయన జనసేన ఆవిర్భావం నుంచి జనసేన నియోజకవర్గ ఇంచార్జిగా పని చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో జనసేన అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ మేరకు టిడిపి, జనసేన పార్టీల సమన్వయానికి ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు శుభాకాంక్షలు చెప్పి అభినందిస్తున్నారు. నియోజకవర్గంలో జనసేన బలోపేతానికి పని చేస్తామని గిరడ అప్పలస్వామి చెప్పారు.

నేరాలు ఘోరాలు

బస్సు నుంచి జారిపడి ప్రయాణికుడు మృతి

దత్తిరాజేరు: మండలంలో పెదమానాపురం సంతోట సమీపంలో సోమవారం సాయంత్రం ఆర్‌టిసి బస్సులో ప్రయాణిస్తున్న కరీంనగర్ జిల్లాకు చెందిన కుక్కడపు శశికిరణ్(40) ప్రమాదవశాత్తు కాలుజారి మృతి చెందాడు. పోలీసులు అందించిన సమాచారం మేరకు.. సాలూరు నుండి విజయనగరం వెళ్తున్న ఆర్‌టిసి బస్సులో ప్రయాణిస్తున్న శశికిరణ్ పెదమానాపురం సంత తోట సమీపంలో కాలు జారి పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. కండక్టర్ ఇచ్చిన సమాచారంతో ప్రమాద సంఘటన వివరాల తెలుసుకొని కరీంనగర్ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పెదమానాపురం ఎస్ఐ శిరీష కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

కొత్తవలస మండలం అప్పనపాలెం గ్రామ పంచాయతీ సమీపంలో గల విశాఖ - అరకు ప్రధాన రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని గొల్జాం గ్రామ పంచాయతీకి చెందిన భార్యాభర్తలకు గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్జాం గ్రామానికి చెందిన పిన్నింటి వెంకటరావు తన ఐదో తరగతి చదువుతున్న కుమార్తె తిరుమల అనారోగ్యం రీత్యా విశాఖలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించి తన భార్య, కుమార్తెతో ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి వస్తుండగా అప్పన్నపాలెం సమీపంలో కుక్క అడ్డు రావడంతో తనంతట తాను పడిపోయారు. ఈ ఘటనలో పిన్నింటి వెంకటరావుకు ఎడమ కాలు విరిగిపోగా భార్య ఈశ్వరమ్మ, కుమార్తె తిరుమలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను కొత్తవలసకు చెందిన 108 వాహనంలో ఎస్‌కోట సిహెచ్‌సికి తరలించారు

రక్షణ భేరి సభ విజయవంతానికి ప్రచారం

అసమానతలు లేని అభివృద్ధి కోసం, ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరి కార్యక్రమంలో భాగంగా ఈనెల 15న విజయవాడలో జరగబోయే మహా బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎస్.కోట, జామి, లక్కవరపుకోట, వేపాడ మండలాల్లో సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో ప్రచార ఆటో జాతాను నిర్వహించారు. విజయనగరంలో కరపత్రాలతో ప్రచారం, గరివిడిలో బైక్ ర్యాలీని సిపిఎం నాయకులు చేపట్టారు.

ప్రజాశక్తి- శృంగవరపుకోట

సిపిఎం ప్రజా రక్షణ భేరిలో భాగంగా ఈ నెల 15న చలో విజయవాడ బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలోని దేవి కూడలి వద్ద ప్రచార జాత ఆటోను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లౌకికవాదం ప్రజాస్వామ్య పరిరక్షణ అసమానతలు లేని అభివృద్ధి కోసం ప్రచారజాత జరిగిందన్నారు. మోడీ వచ్చి పదేళ్ల కావస్తున్నా నిరుద్యోగం తీవ్రమైందని, లౌకికవాదానికి, ప్రజాస్వామ్యానికి ప్రమాదం వాటిల్లిందని తెలిపారు. ప్రభుత్వ రంగాన్ని అడ్డగా అమ్మేస్తున్నారని ఆంధ్రుల హక్కు ఆయన స్టీల్ ప్లాంట్ అమ్మకానికి పెట్టారని, రైల్వేలు, బ్యాంకులు ప్రైవేటు పరం అవుతున్నాయని, నిరుద్యోగ సమస్య దేశంలో తీవ్రం అయిందని అన్నారు. అదానీ, అంబానీ ఒక పక్క, పేదలు ఒక పక్క అసమానతలు పెరిగాయని తెలిపారు. ఈ నేపథ్యంలో బిజెపి మోడీ నుంచి దేశాన్ని కాపాడేందుకు ఈ నెల 15న విజయవాడలో రక్షణ భేరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ చలో విజయవాడ కార్యక్రమానికి జిల్లాలో ఉన్న ప్రజలు, రైతులు, కార్మికులు, మధ్యతరగతి, ఉద్యోగ ఉపాధ్యాయులు, పెద్ద ఎత్తున కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌కోట మండల కేంద్రంలో పాటు సీతంపేట, పోతనపల్లి, సన్యాసి పాలెం, ధర్మవరం, మామిడి, పిల్ల కొట్టం మీదుగా జామి, లక్కవరపుకోట, వేపాడ మండలాల మీదుగా ఆటో జాత ప్రచార కార్యక్రమం నిర్వహించినట్టు మద్దిల రమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గాడి అప్పారావు, చల్ల జగన్, చలికాని ముత్యాలు, ముళ్ళ హర్ష, బి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: ఈనెల 15న విజయవాడలో జరగనున్న ప్రజా రక్షణ భేరి సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ కోరారు. ఈ సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో సభను విజయవంత చేయాలని కోరుతూ విస్తృత ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చల్ల జగన్, మద్దిల రమణ, గాడి అప్పారావు పాల్గొన్నారు.

గరివిడి: ఈ నెల 15న సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న విజయవాడ బహిరంగ సభకు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి అంబల్ల గౌరినాయుడు కోరారు. మండల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం బైక్ ర్యాలీ నిర్వహించారు. డిఏసిఎస్ ఫ్యాక్టరీ నుండి గరివిడి తహశీల్దార్ కార్యాలయం వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్య దర్శివర్గ సభ్యులు టివి. రమణ, జె.స్వామినాయుడు, శనపతి రమణ, చలపతి పాపినాయుడు, సన్యాసినాయుడు, ఫ్యాక్టర్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

జామి: భీమసింగి సహకార చక్కెర కర్మాగారం బాధిత రైతాంగ గ్రామమైన కొట్టాం, విజినిగిరి, తాండ్రంగి, జామి, లక్కవరపుకోట మండలంలో పలు గ్రామాల్లో ప్రచారం సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం ఆటో ప్రచార జాతాను నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ భీమసింగి సహకార చక్కెర కర్మాగారం మూసివేత తో ఈ ప్రాంత చెరుకు రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. తక్షణమే ఫ్యాక్టరీ తెరిపించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిత్యావసర ధరలు తగ్గించి ప్రజానీకాన్ని ఆదుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కోసం తప్ప పేదల కోసం పని చేయడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చల్లా జగన్, సిపిఎం నాయకులు మద్దెల రమణ, గాడి అప్పారావు, ముత్యాలు, పాల్గొన్నారు.

లక్కవరపుకోట : ఈ నెల 15న విజయవాడ కేంద్రంగా జరగనున్న ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ చేపట్టిన సిపిఎం ఆటో జాత సోమవారం మండలంలోని సోంపురం జంక్షన్ వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ విద్య, వైద్యం వంటివి ప్రైవేటీకరణ చేయాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. అనేక సమస్యలపై విజయవాడ కేంద్రంగా చేయబడుతున్న ప్రజా రక్షణ భేరి కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజానీకం పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గాడి అప్పారావు, మద్దిల రమణ, చల్ల జగన్, హర్ష పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : సిపిఎం చేపట్టిన ప్రజారక్షణ భేరీ కార్యక్రమానికి ఇంటికో మనిషి విజయవాడ రావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు పిలుపు నిచ్చారు. 15న విజయవాడలో జరగనున్న సిపిఎం బహిరంగ సభ నిర్వహిస్తున్నందున ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు. సోమవారం రామకృష్ణ నగర్, ఎల్‌బిజి నగర్‌లో విస్తృత ప్రచారంలో భాగంగా సభ నిర్వహించారు. వినాయక నగర్, అయ్యన్నపేట, తదితర చోట్ల జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, నగర కార్యదర్శి వర్గ సభ్యులు బి. రమణ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ముచ్చెరువు గట్టు పై జిల్లా కమిటీ సభ్యులు జగన్ మోహన్, వి. లక్ష్మి ప్రచారం చేశారు. రెడ్డి శంకరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు నెలరోజులుగా వివిధ రూపాల్లో కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఛలో విజయవాడను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జగదాంబ, శాంత మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గరివిడిలో బైక్ ర్యాలీ చేస్తున్న సిపిఎం నాయకులు

విజయనగరం : కరపత్రాలతో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

భూములు మావి.. పేరు విశాఖది

- భోగాపురం విమానాశ్రయం పేరుపై వివాదం
- ప్రహరీగోడపై శ్వాశతంగా ఉండేలా విశాఖ పేరు
- జిఎంఆర్ సంస్థ తీరుపై మండిపడుతున్న రైతులు

ప్రజాశక్తి- భోగాపురం

విమానాశ్రయం నిర్మాణానికి భూములిచ్చింది భోగాపురం రైతులయితే... విమానాశ్రయానికి జిఎంఆర్ విశాఖపట్నం అంతర్జాతీ విమానాశ్రయమని ప్రహరీ గోడలపై శాశ్వతంగా ఉండే పేర్లు దర్శనమిస్తున్నాయి. ఇది చూసిన పలువురు ప్రభుత్వంతో పాటు జిఎమ్ఆర్ సంస్థ తీరుపై మండిపడుతున్నారు. పక్క జిల్లా శ్రీకాకుళంలో పోర్టుకు భూములను మూలపేట రైతులు ఇస్తే భావనపాడు పేరు పెడితే అందుకు అక్కడ రైతులు ఆందోళన చేస్తే చివరకు ప్రభుత్వం మూలపేట పోర్టుగా నామకరణం చేసింది. మరి ఇక్కడ భోగాపురం రైతులు భూమిలిస్తే విశాఖపట్నం పేరు పెట్టడంపై, ప్రజాప్రతినిధులు ఏవిధంగా స్పందిస్తారనేది ఇప్పుడు చర్చనీయాంశమైంది.

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి గత ప్రభుత్వం హయాంలో భూసేకరణకు నిర్ణయించారు. ఎకరా కోట్లలో ఉన్న భూమిని కేవలం లక్షల్లో ఇచ్చిన పరిహారానికి విమానాశ్రయం నిర్మాణం కోసం రైతులు భూములు ఇచ్చేశారు. సుమారు 2,700 ఎకరాలను ప్రభుత్వం భూసేకరణ చేసింది. భూసేకరణ ప్రారంభం నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పేరుతోనే మ్యాప్‌లు దానికి సంబంధించిన రికార్డులు ఉండేవి.

శంకుస్థాపన రోజు భోగాపురం.. ఇప్పుడు విశాఖపట్నం..

విమానాశ్రయానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన రోజు అక్కడ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. అన్నిచోట్ల భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పేరుతో ఉన్నాయి. ఇటీవలి విమనాశ్రయం నిర్మాణ పనులు ప్రారంభమైన వెంటనే ఆ పేరును జిఎమ్ఆర్ సంస్థ మార్చేసింది. ప్రభుత్వం ఇంకా విమానాశ్రయానికి ఏ పేరు పెట్టనప్పుడు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంగానే కొనసాగించాలి. కాని ప్రహరీ గోడలపై శాశ్వతంగా ఉండేలా జిఎమ్ఆర్ విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం పేరుతో ప్రతి 30 మీటర్లుకు ఒకచోట రాయడంపై ఈ ప్రాంతవాసులు మండిపడుతున్నారు.



ప్రహరీగోడపై శాశ్వతంగా ఉండేలా విశాఖపట్నం పేరు

చెక్కును అందిస్తున్న వైసిపి నాయకులు

బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మండలంలోని చినబూరాడ పేటలో ఇటీవల మృతి చెందిన తివనాన పైడి రాజు (29) కుటుంబానికి సోమవారం వైఎస్ఆర్ భీమా పథకం కింద రూ.లక్షను తుమ్మల పేట పిఎసిఎస్ అధ్యక్షులు కోట్ల పైడి నాయుడు, నాయకులు బెల్లాన రామారావు చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి క్రోతు భాస్కరరావు, వెల్‌ఫేర్ అసిస్టెంట్ సూర్య నారాయణ, వాలంటీర్ బి. లక్ష్మీ పాల్గొన్నారు.

గ్రామాల్లో టిడిపి 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

గుర్ల: మేనిఫెస్టో పత్రాలను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - గుర్ల

మండలంలోని తెట్టంగిలో సోమవారం రాష్ట్ర బిసి సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెన్నె సన్యాసినాయుడు ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి టిడిపి మినీ మెనీఫెస్టోను ప్రజలకు వివరించారు. నియోజకవర్గ ఐటిడిపి అధ్యక్షులు నాగులపల్లి నారాయణరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సన్యాసినాయుడు మాట్లాడుతూ టిడిపి అధికారం లోకి వచ్చిన వెంటనే ఇప్పుడు రిజిస్ట్రేషన్ అయిన అంశాలన్నీ అమలు చేయడం జరుగుతుందన్నారు. దానికి గాను ప్రతి కుటుంబానికి ఒక బాండ్ కూడా ఇస్తున్నామన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇంచార్జ్ గేదెల లక్ష్ము నాయుడు, గంద్రేటి సింహాచలం, పాంద్రంకి శ్రీను పాల్గొన్నారు.

శృంగవరపుకోట: టిడిపి నియోజకవర్గ ఇంఛార్జ్ కోళ్ల లలిత కుమారి, రాష్ట్ర ఐటిడిపి కార్యదర్శి చక్కా కిరణ్‌కుమార్, టిఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి రోహిణికుమార్ పలువురు టిడిపి నాయకులతో మండలంలోని తిమిడి గ్రామంలో గంగిరెడ్లకల్లాలు, పలు ప్రాంతాల్లో సోమవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి కరపత్రాలను పంపణీ చేశారు. అనంతరం ప్రజావేదిక ద్వారా గ్రామ ప్రజలకు టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే చేయబోయే మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు. ప్రభుత్వానికీ, ముఖ్యమంత్రికీ వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రతీ క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్ల పరిధిలో ఉన్న ఓటరు జాబితాలను పరిశీలించి దొంగ ఓట్లను గుర్తించాలని, టిడిపి సానుభూతిపరుల ఓట్లను తొలగిస్తే, వాటిని మరల చేర్పించాలని సూచించారు. కొత్త ఓట్లపైన ప్రత్యేకంగా దృష్టి సారించాలని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు సూచించారు.

పూసపాటిరేగ: మండలంలోని గోవిందపురంలో సోమవారం రాత్రి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని టిడిపి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి క్రోతు బంగార్రాజు ఇంటి ఇంటికి తిరిగి భవిష్యత్ గ్యారెంటీ బాండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకర్రావు, టిడిపి పార్లమెంట్ టిఎన్‌టియుసి అధ్యక్షులు విక్రమ్ జగన్నాథం, మండల కోశాధికారి ఇనపకుర్తి శ్రీను, బూత్ ఇంఛార్జిలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎపిజివిబి సిబ్బంది

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నెల్లిమర్ల: అందరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకొని ప్రధానమంత్రి సురక్ష భీమాయోజన పథకంలో చేరాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు నెల్లిమర్ల శాఖ మేనేజర్ శ్రావణ్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని కొండగుంపాం గ్రామంలో ఎపిజివిబి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాదారులకు అనేక రకాల సందేశాలను పంపిస్తున్నారని, వాటికి మనం స్పందించితే మన ఖాతాల నుండి నగదును అపహరిస్తున్నారని తెలిపారు. ఫోన్లు ద్వారా బ్యాంకు మీ వద్ద నుండి ఎటువంటి సమాచారం కోరదని, ప్రతి ఖాతాదారుడు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన పథకంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. తమ బ్యాంకు పొదుపు ఖాతాలపై ఇతర బ్యాంకుల కంటే అత్యధిక వడ్డీ చెల్లిస్తోందన్నారు. పొదుపు ద్వారా భవిష్యత్ జీవితానికి భరోసా ఏర్పర్చుకోవచ్చునన్నారు. తమ బ్యాంకు మిత్రాలు గ్రామాలలో బ్యాంకింగ్ సేవలను నేరుగా అందిస్తున్నారని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా అర్థిక అక్షరాస్యత పై నిర్వహించిన మేజిక్ షో ఆకట్టుకుంది. బ్యాంకు మిత్ర నడిపేన శిరీష, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బస్సుయాత్రను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- రేగిడి

వైసిపి సామాజిక సాధికారిక బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెం నాయుడు, వావిలపల్లి జగన్మోహన్‌రావు అధ్యక్షతన మండలం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16న మధ్యాహ్నం 2 గంటలకు రాజాం పట్టణంలో గల జేజే ఇన్నోటెల్ హోటల్ ఎదురుగా జరగనున్న బస్సు యాత్రకు రాష్ట్ర మంత్రులు, ఎంపిలు, రాష్ట్ర నాయకులు రానున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వచ్చేందుకు కృషి చేయాలని కోరారు. దీనికి ముందు రాజాం మండల కేంద్రంలో ఎమ్మెల్యే కంబాల జోగులు తన ఇంటి వద్ద సాధికారిక బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

సిఎం సహాయ నిధి అందజేత

కొత్తవలస: మండలంలోని దేవాడ గ్రామానికి చెందిన బాలుడు జి.ప్రవీణ్ నరాల సమస్యతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సోమవారం బాలుడుకు రూ. 1.60లక్షలు చెక్‌ను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రవీణ్ తల్లిదండ్రులు వైద్యం చేయించుకొనే స్తోమత లేదని తన దృష్టికి తీసుకొచ్చారని వెంటనే తాను సిఎం సహాయ నిధి కావాలని కోరడంతో సిఎం నిధులు మంజూరు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, గోర్లె రవి, దేవాడ సర్పంచ్ రమణ, దేవాడ గ్రామ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలుడికి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే

25న భవన నిర్మాణ కార్మికుల మహాసభ

ప్రజాశక్తి - వంగర

ఈ నెల 25న మండల కేంద్రంలో జరగనున్న మండల భవన నిర్మాణ కార్మికుల 2వ మహాసభలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకరరావు, కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తినాయుడు, మండల అధ్యక్ష కార్యదర్శులు డి.అప్పలనాయుడు, ఎ.ఆదినారాయణ కోరారు. సోమవారం వంగరలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఉన్న భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలు రాష్ట్ర, మండల స్థాయిలో నిర్వహించామని, స్థానికంగా యజమానులకు కార్మికులకు మధ్య వచ్చిన సమస్యలను యూనియన్ అనేక దపాల పరిష్కారాలు చేసిందని, గత మూడేళ్ల కాలంలో సంఘం చేసిన కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్తు కార్యక్రమాలు రూపొందించుకోవడానికి ఈ మహాసభను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సభను విజయవంతం చేయాల్సిన బాధ్యత కార్మికులపై ఉందన్నారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు పి. విశ్వనాథం, ఎం. త్రినాధ రావు. మండల నాయకులు రామారావు, శ్రీనివాసరావు, గౌరి నాయుడు, ఆదినారాయణ, శ్రీను, సూరిబాబు, కళ్యాణ్, సత్యం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శంకరరావు, రామ్మూర్తినాయుడు తదితరులు

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE, RAJAM
O.S.NO.28/2023

Between:
GAJUREDDI GOPI. ......PLAINTIFF
And
MULAM DHANALAKSHMI & 2 OTHERS. ....DEFENDANTS

To
(1) Mulam Dhanalakshmi, W/o. Late Kamalakara Rao, Hindu, aged about 50 years, House-hold duties, residing at MIG, Plot No. 501, P.N. Colony, Srikakulam.
(2) Mulam Sai Lahari, D/o. Late Kamalakara Rao, Hindu, aged about 25 years, residing at MIG, Plot No. 501, P.N. Colony, Srikakulam.
(3) Mulam Khagesh, S/o. Late Kamalakara Rao, Hindu, aged about 23 years, residing at MIG, Plot No. 501, P.N. Colony, Srikakulam.

GENERAL NOTICE

Please take Notice that the above named plaintiff filed a suit and IA.No. 84/2023 against you for the recovery of the promissory note amount due together with interest against the estate and properties of the deceased Mulam Kamalakara Rao which are in the hands of you.

That the above suit and petition in I.A.No. 84/2023 is posted for your appears at **10-30 A.M. on 17/11/2023** before the above said Court and if you want to contest the matter you may do so either in person or by a duly instructed pleader and if you fail to show cause matter will be decided in your absence and expert.

(By order of the Honourable Court)

Majji Narasinga Rao
Advocate, Teacher's Colony,
Garividi, Cell No. 94404 25672.

మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
EP : 17/2023 OS : 354/2017

Between :
మనం సంజీవరావు ......డిక్రీ హోల్డర్
And :
ఆరిపాక నాగ సత్య జగన్‌మోహన్‌రావు ...జడ్జిమెంట్ డెటార్
To
శ్రీ ఆరిపాక నాగ సత్య జగన్‌మోహనరావు, S/o రామారావు, సెకండరీ గ్రేడ్ టీచర్, ఎంపిపి స్కూలు, ఎస్.కోట, తలారి (ఉసిరి), ఎస్.కోట మండలం, విజయనగరం జిల్లా.
నివాసము :- రామకృష్ణ మోడల్ హైస్కూల్ వెనుక, చైతన్య జూనియర్ కాలేజీ దగ్గర, శృంగవరపుకోట గ్రామము మరియు మండలం, విజయనగరం జిల్లా.

పై నెంబరు కేసులో డిక్రీ హోల్డర్ మీ యొక్క షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని ప్రథమ జప్తు మరియు నోటీసు కోరుచూ పై నెంబరు అమలు పిటిషను దాఖలు చేసి ఉన్నారు. అయితే కోర్టువారి ఉత్తర్వులు ప్రకారము మీ యొక్క ఆస్తి ప్రథమ జప్తు జరిగినది. కానీ అదే నెంబరు అమలు పిటిషన్‌లో మీకు నోటీసు పంపినప్పటికీ మీరు గ్రామములో లేరని తిరిగి వచ్చినందున, మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు నిమిత్తము **తే 11-12-2023దీన ఉదయం 10-30 నిమిషములకు** వాయిదా అయి ఉన్నది. కనుక పై నెంబరు గల అమలు పిటిషన్‌లో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల మీరు స్వయముగా కానీ ప్లీడరు గారి ద్వారా గాని పై తేదీన పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయగలరు. లేని యెడల సదరు అమలు పిటిషన్ మీ పరోక్షమందు తీర్మానించడము జరుగునని మీరు తెలుసుకోగలరు.

పి.హరగోపాల్
ఆర్.శ్రీనివాసన్
అడ్వకేట్స్, విజయనగరం